క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ పిఠాపురం పట్టణ అధ్యక్షుడిగా రావుల



పిఠాపురం: వైఎస్సార్‌ సీపీ పిఠాపురం పట్టణ అధ్యక్షుడిగా రావుల వీరవెంకట సూర్య మాధవరావు నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదివారం ఈ మేరకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా సూర్యమాధవరావుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు



ఏడీ రామస్వామి

పెద్దాపురం: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి సబ్‌ డివిజన్‌ పరిధిలోని కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నామని ఆ శాఖ పెద్దాపురం ఏడీ తుమ్మల రామస్వామి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 31వ తేదీ వరకు ఆయా మండలాల్లో రెండు బృందాలుగా ఈ పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు. తొలి రోజు పెద్దాపురం మండలం తాటిపర్తి, కాండ్రకోట, కిర్లంపూడి మండలం జగపతినగరం, ముక్కొల్లు, 21వ తేదీన పెద్దాపురం మండలం ఆర్‌బీ కొత్తూరు, మర్లావ, కిర్లంపూడి మండలం రాజుపాలెంతో పాటు, 22వ తేదీ నుంచి రెండు మండలాల్లో పశువైద్య శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21 నుంచి పెసా చట్టంపై రెండో బ్యాచ్‌కు శిక్షణ

సామర్లకోట: గిరిజన ప్రాంతాల్లో నివాసితులకు పంచాయత్‌ ఎక్స్‌టెన్షన్‌ టు షెడ్యూల్డ్‌ ఏరియాస్‌(పెసా) చట్టంపై అవగాహన కల్పించడానికి 21, 22వ తేదీల్లో స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో రెండో బ్యాచ్‌ శిక్షణ ప్రారంభమవుతుందని ఈటీసీ మేనేజర్‌ పి.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో గిరిజనులు నివసిస్తున్న ప్రాంతాల్లోని ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులకు మాస్టర్‌ ట్రైనర్లుగా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు వచ్చే నెల నుంచి గిరిజన మండలాల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు పీసా చట్టంపై అవగాహన కల్పిస్తారన్నారు.

మండల పరిషత్‌ కార్యాలయంలో నేడు గ్రీవెన్స్‌

సామర్లకోట: మండలంలోని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి సోమవారం ఉదయం 10 గంటల నుంచి గ్రీవెన్స్‌ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 18 గ్రామాలకు చెందినవారు తమ సమస్యలపై సామర్లకోట మండల పరిషత్‌ కార్యాలయంలో అర్జీలను అందజేయవచ్చని చెప్పారు. అర్జీదారులు కాకినాడలో కలెక్టర్‌ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి అర్జీకి రసీదు ఇస్తారని తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

కొత్తపల్లి: కోడి పందేలపై ఆదివారం దాడి చేసి పది మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కొండెవరం శివారు కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై వెంకటేష్‌ తన సిబ్బందితో దాడి చేశారు. పది మందిని అరెస్టు చేసి, రెండు కోడి పుంజులు, రూ.4,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి గ్రామోత్సవం



మాండవ్య నారాయణస్వామి ఆలయంలో లక్ష్మీదేవి గ్రామోత్సవం

సామర్లకోట: పట్టణంలో ఉన్న పురాతన విష్ణు ఆలయమైన మాండవ్య నారాయణ స్వామి ఆలయంలోని దేవేరి లక్ష్మీదేవి గ్రామోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో సాగింది. మాఘమాసం లక్ష్మీదేవి ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా గ్రామోత్సవం ప్రారంభమైంది. ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి, స్టేషన్‌ సెంటర్‌, గోలివారి వీధి, గాంధీచౌక్‌, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, నీలమ్మ చెరువు, మఠంసెంటర్‌, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం కొనసాగింది.

గుమ్మడి కాదు.. పుత్తడి..!

- కూర గుమ్మడికి గణనీయంగా రాబడి
- అన్ని వేళలా ఆదాయమిచ్చే దీనిని పండించేందుకు రైతుల ఆసక్తి
- పిఠాపురం నియోజకవర్గంలో పెరిగిన సాగు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గుమ్మడికాయలు



గుమ్మడి పాదులు

పిఠాపురం: భారత సంస్కృతి సంప్రదాయాల్లో గుమ్మడిది ప్రత్యేక స్థానం. శుభకార్యాలు, పూజలు, వంటలు, మిఠాయిలలోనే కాక, ఔషధాల తయారీలోను ఇది ప్రత్యేకత సంతరించుకుంది. ఇప్పటి వరకు కూరలకు, స్వీట్లకు మాత్రమే వినియోగించే గుమ్మడి ఆరోగ్యప్రదాయని అన్న విషయాన్ని కరోనా వచ్చి గుర్తు చేయడంతో.. దీనికి మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. తద్వారా గుమ్మడి పంట బంగారంగా మారిపోయింది. ఈ పంటను ఇప్పుడు రైతులు తమ పొలాల్లో పండించి, మంచి రాబడి పొందుతున్నారు. ఇతర పంటలతో పోలిస్తే గుమ్మడి సాగులో శ్రమ, ఖర్చు తక్కువే. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో మేలైన రాబడినిస్తుండడంతో దీని సాగుపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటి వరకు కేవలం శుభకార్యాలకు, వంటల్లో ఉపయోగించే దీనిని.. ప్రస్తుతం గుండె సంబంధ వ్యాధులకు ఔషధంగా ఎక్కువగా వినియోగిస్తుండడంతో, దీనికి గిరాకీ పెరిగి మార్కెటింగ్‌ ఊపందుకుంది. ఎక్కువ మంది రైతులు దీనిని పిఠాపురం నియోజకవర్గంతో పాటు, వివిధ ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో అంతర పంటగా సాగు చేసి, అధిక దిగుబడులు, రాబడిని సాధిస్తున్నారు. నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఇది సుమారు 20 హెక్టార్లలో సాగవుతోంది.

రాబడిలో ముద్దు గుమ్మడి

ఏ పంటైనా కొంత సమయం మాత్రమే నిల్వ ఉంటుంది. అందుకే ధర వచ్చినా, రాకపోయినా అమ్మి తీరాల్సిందే. కానీ కూర గుమ్మడి అలా కాదు. ఎన్నాళ్లయినా నిల్వ ఉంటుంది. అందుకే ఎప్పుడు ధర ఉంటే అప్పుడే అమ్ముకుంటారు. తద్వారా అనుకున్నంత ఆదాయం వచ్చి తీరుతుంది. ఎకరానికి సుమారు 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పెట్టుబడి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టి సాగు చేస్తే, ఎకరానికి 15 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఒక్కో కాయ 2 కేజీల నుంచి 10 కేజీల వరకు బరువు ఉండగా, మార్కెట్‌లో టన్ను రూ.18 వేల వరకు ధర పలుకుతోంది.

నీటి వసతి తక్కువగా ఉన్నా..

కేవలం మూడు నెలల వ్యవధిలో నీటి వసతి తక్కువగా ఉన్నా, పంట ఏమాత్రం ఇబ్బంది లేకుండా పండుతోందంటున్నారు రైతులు. ఇతర పంటలకు ఎకరానికి సరిపడా నీరు గుమ్మడికి నాలుగు ఎకరాలకు సరిపోతుంది. చీడపీడల బెడద ఉండకపోవడం, ఎరువులు, పురుగు మందుల అవసరం అతి తక్కువగా ఉండడం వల్ల పెట్టుబడి చాలా తక్కువగా ఉంటుంది. విత్తనం, ఎరువులు, కూలి ఖర్చులతో సహా ఎకరానికి రూ.15 వేల వరకు మాత్రమే పెట్టుబడి అవుతుండగా, ఎకరానికి 15 టన్నుల వరకు దిగుబడి వచ్చి రూ.1.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. దీంతో రైతులు ప్రస్తుతం ఈ పంట సాగుపై మక్కువ చూపుతున్నారు. కాకినాడ జిల్లాలో పండిస్తున్న కూర గుమ్మడి పంటను స్థానిక మార్కెట్లలో విక్రయిస్తున్నారు. వ్యయ ప్రయాసలు తక్కువతో పాటు, అమ్ముకోవడం సులువుగా ఉండడంతో పలువురు రైతులు వీటి సాగుకు ముందుకు వస్తున్నారు.

బూడిద గుమ్మడితో ఆరోగ్య పరిపుష్టి

ఏ ఇంటి ముందు చూసినా బూడిద గుమ్మడి కాయ తగిలించి కనిపిస్తుంది. ఏ శుభకార్యం జరిగినా దీనిని దిష్టి తీసి కొడుతుంటారు. ఎందుకంటే దీనిలో ప్రాణ శక్తి అధికంగా ఉంటుందని పూర్వీకులు గ్రహించి, దీనికి అంత ప్రాధాన్యమిచ్చారు. అదే ప్రాణ శక్తిని మనిషికి కూడా అందించే దివ్యౌషధంగా కరోనా వచ్చిన తరువాత గుర్తించారు. దీనిని ఔషధంగా ఉపయోగిస్తే కలిగే లాభాలు అంతాఇంతా కాదంటున్నారు ఆయుర్వేద వైద్యులు. ఇందులో బీటా కెరోటిన్‌ ఎక్కువగా ఉంటుంది. ఈ యాంటీ ఆక్సిడెంట్‌ను శరీరం విటమిన్‌–ఏగా మార్చుకుంటుంది. ముఖ్యంగా శరీరానికి హాని కలిగించే సూక్ష్మక్రిములను బయటకు నెట్టి వేస్తుంది. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలతో పాటు, ఇతర అవయవాలు బలంగా ఉండేలా చూస్తుంది. ఇది తినడం ద్వారా విటమిన్‌–ఏ ఎక్కువగా లభిస్తుంది. కంటి సమస్యలు దూరమవుతాయి. పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. క్యాలరీలు చాలా తక్కువగా ఉండడం, పీచు ఎక్కువగా ఉండడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేయడానికి దోహదపడుతుంది. వంద గ్రాముల గుమ్మడి జ్యూస్‌లో కేవలం 10 క్యాలరీలు మాత్రమే ఉండడంతో, దీనిని జీరో క్యాలరీస్‌ జ్యూస్‌గా చెబుతుంటారు. అన్ని కూరగాయల కంటే అతి తక్కువ క్యాలరీలు ఉన్నది ఇది ఒక్కటే. దీనిలో విటమిన్స్‌, మినరల్స్‌, లవణాలు చెప్పలేనన్ని ఉంటాయి. ప్రతి రోజు గ్లాసు జ్యూస్‌ తీసుకుంటే, శరీరంలో క్యాన్సర్‌ కణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, గుండె పనితీరు మెరుగుపడుతుందని శాస్త్రీయ పరిశోధనల్లో నిరూపితమైంది. మెదడు పనితీరు పెరగడం, శరీరంలో చురుకుదనం పెరగడం దీని ప్రత్యేకత.

ఆదాయం బాగుంటుందని..



నా పేరు కొండపల్లి వీరబాబు. మాది పిఠాపురం మండలం విరవాడ. నేను ఉద్యాన పంటలు సాగు చేస్తూ, సొంతంగా అమ్ముతుంటాను. బూడిద గుమ్మడితో పాటు, కూర గుమ్మడి సాగు ప్రారంభించాను. రెండేళ్లుగా నేను రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నాను. పెట్టిన పంటకు మంచి దిగుబడి వచ్చింది. ఎకరానికి కనీసం రూ.50 వేల వరకు ఆదాయం వచ్చేది. దీంతో ఇతర పంటలకు పెట్టుబడి వచ్చేది. గతంలో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ అమ్మేవాడిని. ఇప్పుడు సొంతంగా పండించి అమ్ముతున్నాను. ఇప్పుడు టన్ను రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పలుకుతుంది. దీంతో నేను పండించే పంటను ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యేకంగా పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడం వల్ల అంతర పంటగానే సాగు చేస్తున్నాను. పెట్టుబడి కంటే రాబడి పదిరెట్లు ఎక్కువగా ఉంటోంది. ఎక్కువగా నాటు రకాలకే డిమాండ్‌ ఉంటోంది. అందుకే దానినే సాగు చేస్తున్నాను.

రైతులు ఆసక్తి చూపుతున్నారు



గుమ్మడి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఈ పంటను సాగు చేసేందుకు గతంలో కంటే ఇప్పుడు రైతులు ముందుకు వస్తున్నారు. పెద్దగా పెట్టుబడి పెట్టే అవసరం లేకపోవడం, అంతర పంటగా సాగు చేసుకునే వీలుండడంతో పాటు, మంచి ఆదాయం కూడా వస్తుండడంతో దీనిపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. గత రెండేళ్ల కంటే ఈ ఏడాది దీనిని సాగు చేసే రైతులు పెరిగారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులకు సూచనలు అందిస్తున్నాం. మార్కెటింగ్‌ సౌకర్యం పెరగడంతో ఆదాయం బాగుంటుంది.

– కేఎస్‌ శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

కిటకిటలాడిన రైల్వే స్టేషన్‌, బస్టాండ్‌

తిరుగు పయనంలో ప్రయాణికుల పాట్లు



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో కిటకిటలాడిన ప్రయాణికులు

సామర్లకోట: ముఖ్యకూడలి ప్రదేశమైన సామర్లకోటలోని రైల్వే స్టేషన్‌, బస్సు కాంప్లెక్స్‌ ఆదివారం ప్రయాణికులతో కిటకిటలాడాయి. సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన ప్రయాణికులు తిరుగు పయనమయ్యారు. పిల్లలకు సెలవులు ముగియడంతో కుటుంబ సభ్యులతో తమ ప్రాంతాలకు తరలివెళ్లారు. సంక్రాంతిని పురస్కరించుకుని రైల్వే శాఖ ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినా, అన్ని రైళ్లు రద్దీగా ఉన్నాయి. రైళ్ల రద్దీని దృష్టిలో ఉంచుకుని అనేక మంది మూడు నెలల ముందుగానే రిజర్వేషన్లు చేయించుకున్నారు. విశాఖపట్నం, విజయవాడ వైపు నుంచి వచ్చిన ప్రయాణికులు రైళ్లలో వెళ్లడానికి సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తరలివచ్చారు. దాంతో ఒకటి, మూడో నంబరు ప్లాట్‌ఫారాలు ప్రయాణికులతో కిటకిటలాడాయి. సంక్రాంతి సందర్భంగా బంధువులు, స్నేహితులతో ఆనందంగా గడిపి, తిరుగు ప్రయాణంలో వారి గమ్యస్థానాలకు చేరుతున్నారు. సామర్లకోట నుంచి కాకినాడ, పెద్దాపురం, కిర్లంపూడి, జగ్గంపేట, ఏలేశ్వరం, పిఠాపురం, వేట్లపాలెం, ప్రతిపాడు తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ప్లాట్‌ఫారంపై రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే స్టేషన్‌ మేనేజర్‌ ఎం.రమేష్‌ ఆధ్వర్యంలో ప్రయాణికులను అప్రమత్తం చేసే కార్యక్రమం చేపట్టారు. ప్లాట్‌ఫారంపై రద్దీగా ఉన్న సమయాల్లో ప్రయాణికుల బ్యాగ్‌లు తరచూ చోరీకి గురవుతుండడంతో, ప్రయాణికులను అప్రమత్తం చేశారు. రైల్వే స్టేషన్‌ ఎదురుగానే బస్సు కాంప్లెక్స్‌ ఉండటంతో, అక్కడ కూడా ప్రయాణికుల రద్దీ ఏర్పడింది.

నేటి నుంచి తొమ్మిది మూరల సాహెబ్‌ ఉరుస్‌

మూడు రోజుల పాటు గంధోత్సవ వేడుకలు



తొమ్మిది మూరల సాహెబ్‌ సమాధి

పెద్దాపురం: సుమారు 354 ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణ శివారులోని హజ్రత్‌ షేక్‌ మదీనా పాచ్చా ఔలియా(తొమ్మిది మూరల సాహెబ్‌) ఉరుస్‌ గంధోత్సవాలు ఈ నెల 20 నుంచి 22 వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు దర్గా కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మతాలకతీతంగా 20వ తేదీన దర్గా వద్దకు వివిధ వర్గాల ప్రజలు విచ్చేసి, బాబా ఆశీస్సులు పొందుతారు. అంజుమన్‌ వ్యవస్థాపకుడు దివంగత ఎంఎ సత్తార్‌ ఇంటి వద్ద నుంచి 20న మధ్యాహ్నం రెండు గంటలకు గంధం ఊరేగింపు బయలుదేరి, దర్గా వద్దకు చేరుకుంటుంది. సాయంత్రం ఏడు గంటలకు ఖురాన్‌ పఠనంతో చాదర్‌, గంధోత్సవం జరుగుతాయి. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, అధికారులు అతిథులుగా హాజరావుతారు. ఈ నెల 22 వరకు ఉరుస్‌ కార్యక్రమాలు నిర్వహించి, కమిటీ ఆధ్వర్యంలో మూడో రోజు భారీ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కొత్తపల్లి: పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు, కొత్తపల్లి శివారు రవీంద్రపురానికి చెందిన బి.శ్రీనివాస్‌ మోటార్‌ సైకిల్‌పై పిఠాపురం నుంచి ఇంటికి వస్తున్నాడు. కొండెవరం వద్ద ఉప్పాడ నుంచి పిఠాపురం వైపు వెళ్తున్న కారు అతడి మోటార్‌ సైకిల్‌ను ఢీకొంది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు గాయాలు కాగా, చికిత్స కోసం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై వెంకటేష్‌ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సాగర తీరం.. జన కెరటం



ఉప్పాడ వద్ద సాగర తీరంలో సందర్శకుల తాకిడి

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ వద్ద సాగర తీరం ఆదివారం పర్యాటకులతో హోరెత్తింది. సంక్రాంతి సెలవుల సందర్భంగా పర్యాటకులు కడలి వద్దకు చేరుకుని, కెరటాల్లో కేరింతలు కొట్టారు. మండలం నుంచి వివిధ గ్రామాలతో పాటు, పిఠాపురం, కాకినాడ, గొల్లప్రోలు, సామర్లకోట తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఉప్పాడ సాగర తీరానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో వాహనాలు రావడం వల్ల కాకినాడ–ఉప్పాడ బీచ్‌ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్సై వెంకటేష్‌ తన సిబ్బందితో వాహనాలను క్రమబద్ధీకరించారు. పర్యాటకుల ఆటపాటలతో సాగర తీరం క్రీడా మైదానంగా మారిపోయింది. తుని సమీపంలో తలుపులమ్మ తల్లి లోవ అమ్మవారిని దర్శించుకుని వెళ్లిన భక్తులు.. మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు.

ఓ మనిషీ.. మట్టిని రక్షించు..

మారథాన్‌లో ఆకట్టుకున్న వృద్ధుడు



సూర్యారావుపేట బీచ్‌ వద్ద సేవ్‌ సాయిల్‌ నినాదంతో సుబ్రహ్మణ్యశర్మ

కాకినాడ రూరల్‌: కాకినాడ మారథాన్‌లో విశాఖపట్నం ఎంవీపీ కాలనీకి చెందిన వృద్ధుడు, చార్టర్డ్‌ సివిల్‌ ఇంజినీర్‌ చల్లా సుబ్రహ్మణ్యశర్మ 'మట్టిని రక్షించు'(సేవ్‌ సాయిల్‌) అంటూ హాఫ్‌ మారథాన్‌ రన్‌తో ఆకట్టుకున్నారు. సూర్యారావుపేట బీచ్‌లో ఆదివారం ఉదయం జరిగిన మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మన భూమాత(మట్టి) సంక్షేమానికి మూలం పాదాల కిందే ఉందన్నారు. ఈషా ఫౌండేషన్‌ సద్గురు మట్టిని రక్షించు ఉద్యమం 2022 మార్చిలో ప్రారంభించడంతో, ఆయన ప్రేరణతో ప్రజల్లో అవగాహన కోసం సేవ్‌ సాయిల్‌ నినాదంతో అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, హైదరాబాద్‌, బెంగళూరు, గోవా, రాయపూర్‌, సంబల్‌పూర్‌, భువనేశ్వర్‌ వంటి ప్రాంతాలలో సుమారు 5,612 కిలో మీటర్లను పరుగెత్తినట్టు చెప్పారు. చార్టర్డ్‌ ఇంజినీరుగా పనిచేస్తూ, వారంలో రెండు రోజుల పాటు సేవ్‌ సాయిల్‌ పేరుతో రన్‌ చేస్తున్నట్టు తెలిపారు.

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఉప్పాడ తీరంలో పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: మితిమీరుతున్న సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్‌ హెచ్చరించారు. ఉప్పాడ తీర ప్రాంతంలో పర్యాటకులకు ఆదివారం సైబర్‌ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్మార్ట్‌ ఫోన్ల వినియోగం గణనీయంగా పెరగడంతో, ఇటీవల సైబర్‌ నేరగాళ్లు పేట్రేగిపోతున్నారన్నారు. డిజిటల్‌ అరెస్టులంటూ ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. పోలీసు చట్టంలో డిజిటల్‌ అరెస్టు ప్రస్తావనే లేదన్నారు. సంబంధం లేని యాప్‌లు, ఫోన్లకు వస్తున్న ఓటీపీల జోలికి వెళ్లకూడదన్నారు. అనేక కోణాల్లో ఎర వేసి ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్న సైబర్‌ నేరగాళ్ల ఆగడాలపై అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మహిళల సంరక్షణ, భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ఇళ్లలో చోరీల నివారణపై కూడా అవగాహన ఉండాలన్నారు. ఎవరైనా ఈవ్‌ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారదర్శకంగా రేషన్‌ డీలర్ల రాత పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: డివిజన్‌ పరిధిలో 50 రేషన్‌ దుకాణాల డీలర్ల ఎంపిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. స్థానిక మహారాణి కళాశాలలో ఆదివారం నిర్వహించిన రేషన్‌ డీలర్ల ఎంపిక రాత పరీక్షా కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ, డివిజన్‌ పరిధిలో 50 దుకాణాలకు సంబంధించి 197 దరఖాస్తులు దాఖలు కాగా, 125 మంది రాత పరీక్షకు అర్హత పొందారన్నారు. వీరిలో రాత పరీక్షకు 119 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రానికి సూపర్‌వైజర్‌గా ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు వ్యవహరించారు. కార్యాలయ డీటీ భానుకుమార్‌ ఏర్పాట్లును పర్యవేక్షించారు.

సంగీత వాయిద్య పోటీలకు విశేష స్పందన



విజేతకు బహుమతి ఇస్తున్న వీసీ మురళీకృష్ణ

బోట్‌క్లబ్‌ (కాకినాడ సిటీ): కాకినాడ సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో సంక్రాంతి వార్షిక సంగీత సభల్లో భాగంగా ఆదివారం సూర్యకళా మందిరంలో రాష్ట్ర స్థాయి కర్ణాటక గాత్ర, వాయిద్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 35 మంది పాల్గొన్నారు. జూనియర్‌, సీనియర్‌ విభాగంలో పోటీలు జరిగాయి. పోటీలకు సంగీత విద్వాంసులు డి.నగేష్‌ బాబు, రెహమాన్‌ న్యాయమూర్తులుగా వ్యవహరించారు. గాత్రం, వయోలిన్‌, వేణువు, వీణ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్ననాటి నుంచి విద్యార్థులకు నచ్చిన అంశాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. సంగీత రంగంలో రాణించడం ద్వారా ఎందరో పేరు ప్రఖ్యాతులు సాధించారన్నారు. గెలుపోటములతో ప్రమేయం లేకుండా విద్యార్థులు తమ కృషిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సంగీత విద్వత్సభ అధ్యక్షుడు నారాయణం మురళీ, సెక్రటరీ వక్కలంక రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు ఆర్‌ఏ రావు, కృష్ణంరాజు, మణిబాబు, చావలి సూర్యకుమారి, గట్టి శ్రీకృష్ణదేవరాయ, వెంకట్రావు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

గాత్ర విభాగంలో వి.సంతోష్‌కుమార్‌, స్మరణ్‌, కె.భార్గవ్‌ వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వాయిద్య విభాగంలో సంతోష్‌ తమన్‌, దీక్షిత్‌ మురారి, సాయి శర్వాణి, వీణ సీనియర్‌ విభాగంలో ఆర్‌ దేవీశ్రీప్రియ, రాజ్‌కౌశల్‌ బహుమతులు పొందారు.

సీసీ రోడ్లకు నేడు శంకుస్థాపన

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో చైర్‌పర్సన్‌ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన బీపీఎస్‌ నిధులతో సోమవారం పలు రోడ్లకు శంకుస్థాపనలు జరుగుతాయని మున్సిపల్‌ కమిషనర్‌ ఎ.శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దాపురం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఒకటి, తొమ్మిది, 22, 24, 27, 30, 31 వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తారని వివరించారు.